క్లుప్తంగా

15న మండల సమావేశం

నర్వ: ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ జయరాములుశెట్టి అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. అన్నిశాఖల అధికారులు తమశాఖ పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు.

ఫిల్టర్ ఇసుక తయారీ దారుపై కేసునమోదు

కోస్గి: మండల పరిధిలోని కడంపల్లిలో ఫిల్టర్ ఇసుక తయారుచేసి అక్రమ రవాణా చేస్తున్న యజమానిపై కేసునమోదు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటాచారి అనే వ్యక్తి ఫిల్టర్ ఇసుక తయారుచేయించి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న తహసీల్దార్ బుధవారం గ్రామానికి వెళ్లి తనిఖీ చేయగా ఇసుకట్రాక్టర్ పట్టుబడింది. పట్టుబడిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానిపై వాల్టా చట్టం కింద కేసునమోదు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

75వ రోజుకు చేరిన దీక్షలు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దుచేయాలని గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటితో 75వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కంపెనీ పోరాట వ్యతిరేక కమిటీ సభ్యులు సుదర్శన్, వెంకట్రాములు మాట్లాడుతూ.. బాధిత గ్రామాల ప్రజలు కంపెనీని రద్దుచేయాలని 75రోజులుగా దీక్షలు చేస్తుంటే కనీసం ఇక్కడి ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధగా ఉందన్నారు. కంపెనీని రద్దుచేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

నారాయణపేట రూరల్: క్రీడల్లో పాల్గొనడంతో పోటీతత్వం పెరుగుతుందని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటలు ఆడటంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యువత రోజువారి దినచర్యలో భాగంగా చదువుతో పాటు క్రీడలకు స్థానం కల్పించాలన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. గుంపుబాలరాజు, రమణ, పర్వీన్, అక్తర్‌పాషా, వెంకటప్ప, భీంరెడ్డి, రాధిక, కృష్ణవేణి, సాయినాథ్, శిల్ప, సవిత, నాగేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన కమిటీ ఎన్నిక

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నందిగామలో బుధవారం అంబేడ్కర్ యువజన నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, సుగుణమ్మ, ఎల్లమ్మ, దేవమ్మ, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, కోశాధికారిగా రాములు, రమేష్, సహాయ కార్యదర్శిగా మహిపాల్, కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, కాశీమన్న, వెంకటయ్య, బీమప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, వంశీ, కృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఊట్కూరు: హరితాహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ రమేష్ కోరారు. బుధవారం నిడుగుర్తి రహదారిపై నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కల చుట్టు పాదులు తవ్వాలని మేకలు మేయకుండా కంచేఏర్పాటుచేయాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు, గ్రామ పంచాయతీ సిబ్బంది గిరిజప్ప, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నారాయణపేట రూరల్ : సమగ్రశిక్ష ఉద్యోగులు 9వరోజూ నిరసన కొనసాగించారు. స్థానిక వివేకానంద మున్సిపల్‌పార్క్ వద్ద బుధవారం రిలేదీక్షలకు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వశిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. సర్వీస్‌ను రెగ్యులర్ చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ట్రస్మా నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఖదీర్, భరత్, చిన్న, మనోహర్‌గౌడ్, సంతోష్‌కుమార్, వెంకటయ్య, అడ్వకేట్లు దత్తత్రేయ, ఎల్లాగౌడ్, రాజశేఖర్, కృష్ణారెడ్డి, నారాయణపవర్, కరీష్మ, పవిత్ర, రవిప్రకాష్, ఆరీఫ్‌అహ్మద్, నాగేందర్, రమేష్, హుసేన్ పాల్గొన్నారు.

యజ్ఞాలతో సమృద్ధిగా వర్షాలు..

ఊట్కూర్: యజ్ఞాలతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పండిత్ విశ్వశ్రవ అన్నారు. మండలంలోని ఆర్యసమాజంలో కొనసాగుతున్న శ్రావణవేద ప్రచార త్రిదివశీయ బుధవారం ముగిసింది. ఉదయం దేవయజ్ఞం పూర్ణాహుతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యజ్ఞాలతో వాయు కాలుష్యం తగ్గి మేఘాలు చల్లబడి వర్షాలు కురుస్తాయన్నారు. యజ్ఞా, యాగాలు లోకల్యాణం కోసం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, అధ్యక్షుడు కనకప్ప ఆర్య, సత్యపాల్, గొల్ల దివాకర్, బాల్‌రాజ్, సుధాకర్, పవన్‌కుమార్‌పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


మక్తల్‌లో ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

మక్తల్: పేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గడ్డంపల్లిగ్రామానికి చెందిన దాదాపు 40మంది కార్యకర్తలు మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఎంతో మంది వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. మరోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లక్ష్మన్న, అంజన్న, సవరన్న, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మరికల్: అంబేడ్కర్ ఆశయాలతో సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జిన్నారంలో బుధవారం ఎమ్మెల్యే నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. అలాగే హెల్త్‌సెంటర్ రూ. 20 లక్షలు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ. 20 లక్షలు, జిన్నారం నుంచి మట్టిరాళ్లతండా రూ. 20 లక్షలతో చేపట్టే పనులను ప్రారంభించారు. దీంతో పాటు రూ. 22 లక్షలతో నిర్మించిన రైతువేదిక, రూ. 15 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం వివిధ పథకాలను అమలుచేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా ఉందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బూడ్యాగానితాండలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే మండలంలోని కన్మనూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి షాది ముభారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, సర్పంచ్ భాస్కర్, వసుందర, సాయిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, అరుందతి, పద్మమ్మ, సింగిరెడ్డి పరమేశ్వర్, కృష్ణయ్య, రఘునాథ్‌రెడ్డి, చింతలయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ సిబ్బంది

మద్దూరు: నగదు రహిత బ్యాంకు సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని బ్యాంక్ ఫీల్డ్ అధికారి రమేష్ సూచించారు. ఈ మేరకు బుధవారం మద్దూర్ మండల పరిధిలోని పల్లెర్లలో గ్రామీణవికాస్ బ్యాంక్, కర్నూల్‌కు చెందిన ఎం.వీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా గ్రామీణులకు నగదు రహిత బ్యాంకు సేవల వినియోగంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. చెక్కుల ద్వారా లావాదేవీలు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఏటీఎంల ద్వారా నగదు బదిలీ, జమ వంటి సేవలు నగదు రహిత అన్నిబ్యాంకులు అందిస్తున్నాయన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ఆర్థిక లావాదేవీలు కొనసాగించుకోవాలన్నారు. నగదు రహిత సేవలపై కళాకారుల బృందంచే ఆటపాటలతోనూ, మెజీషియన్ల ప్రదర్శనలతో వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, బ్యాంకు మిత్ర వెంకటయ్యతోపాటు రాఘవేందర్, రాజేష్, ఎంపీటీసీ భార్గవి సంజీవ్‌గౌడ్‌తోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కృష్ణా: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కస్తూర్బాపాఠశాలలో పోలీస్ కళాజాత ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్రామాల్లో బాలకార్మికుల నిర్మూలన, రోడ్డు భద్రత, మహిళలపై వేధింపులు, విద్యార్థుల ర్యాగింగ్‌లు తదితర అంశాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ శాలిని, కళాజాత బృందం శేఖర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఊట్కూరు: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని ఎస్‌ఐ గోకారి అన్నారు. బుధవారం మండలస్థాయి క్రీడలలో ప్రతిభగల విద్యార్థులకు ఎంపిక నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడలలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు నిత్యం క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఎంపికైనా క్రీడాకారులు జిల్లాస్థాయి ఆటలపోటీలో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, పీడీ నర్సింహులు, రత్నయ్య, తిరుమలేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జల్దిబిందె కార్యక్రమం

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం ముగింపు అమావాస్య సందర్భంగా గురువారం జల్దిబిందె కార్యక్రమం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు ప్రాప్తులు కావాలని కోరారు.

టీటీడీ మెంబర్‌కు వినతి

ఊట్కూరు: మండలంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో టీటీడీ మెంబర్ దానయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలోని స్వామివారి ఆలయాన్ని నిర్మించడానికి టీటీడీనుంచి ఆర్థికసాయం అందించాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తారాకృష్ణ, హరీష్, రవి, పవన్, శ్రీకాంత్‌వర్మ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తీలేర్ గ్రామస్తులు

మరికల్: అర్హులకు గృహలక్ష్మి, దళితబంధు ఇవ్వాలని బుధవారం తీలేర్ గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతమ్మ మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన నాయకులు వారి అనుచరులకు, బంధువులకు ప్రభుత్వ పథకాలకు ఎంపికచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి అర్హులను ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భజరప్ప, రవి, దేవమ్మ, లక్ష్మి, వెంకటమ్మ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సర్జఖాన్‌పేట విద్యార్థులు


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం తదితరులు

కోస్గి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో కోస్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీల్లో సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో జరిగిన పలు పోటీల్లో అధిక సంఖ్యలో ఈ పాఠశాల విద్యార్థులే ప్రతిభచూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్–17 విభాగంలో పాఠశాల బాలుర జట్టు, బాలికల జట్లు విజేతలుగా నిలిచారు. ఖోఖోలో బాలికల జట్టు విజేతలుగాను, బాలుర జట్టు రెండోస్థానంలో నిలిచారు. అండర్–14 విభాగంలో బాలుర జట్టు విజేతలుగా, బాలికల జట్టు రెండోస్థానం సాధించారు. పాఠశాల నుంచి పాల్గొని ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. వ్యాయమ ఉపాధ్యాయులు నర్సింహులు, ఉపాధ్యాయ బందం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


నారాయణపేటలో సమ్మెలో మాట్లాడుతున్న వెంకట్రామరెడ్డి


మక్తల్‌లో...


కోస్గిలో..

నారాయణపేట: తమకు ఉద్యోగ భద్రతకల్పించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఓ పక్కా సమ్మెకు దిగితే మరో పక్కా ప్రభుత్వం మాత్రం వారు మృతి చెందితే అంత్యక్రియల ఆర్థిక సాయం కింద అంగన్‌వాడీలకు రూ. 20 వేలు, ఆయాలకు రూ. 10 వేలు ఇస్తామని స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రభుత్వం తరపున చెప్పడం హస్యస్పందగా ఉందని తెలంగాణ అంగన్‌వాడీల హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద జరిగిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు.. పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలకనుగుణంగా రూ.26 వేల వేతనం పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ. 10 లక్షలు, ఆయాలకు రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్ రాం, ఇందిరా, సావిత్రిబాయి, సుజాత, శారధ, చెన్నమ్మ, అనిత, నందిని పాల్గొన్నారు.

కోస్గి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలివ్వాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో దీక్షశిబిరంలోనే భోజనాలు చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ఉద్యోగభద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పుమేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. పదవీ విరమణ చేసిన టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు చంద్రకళ, ఉమామహేశ్వరి, బారతీ, రమాదేవి, పుష్పలత, ప్రమీల, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ధర్న చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ, సీపీఎం, ఐఎఫ్‌టీయూ నాయకులు మద్దుతు పలికారు. అంగన్‌వాడీలకు నెలకు రూ. 26 వేతనం అందజేయాలని, గతంలో ప్రభుత్వం ప్రకటించిన అన్ని హామీలను నేరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు హన్మంతు, అంగన్‌వాడీలు శశికళ, పుష్ప, భాగ్యమ్మ, అనంతమ్మ, మంగమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

మక్తల్: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు నెలకు రూ. 26 వేతనం అందజేయాలని, గతంలో ప్రభుత్వం ప్రకటించిన అన్ని హామీలను చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవింద్ రాజు, అధ్యక్షుడు రాజు, విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి జమున, రాధిక, శ్రీలత, సుకన్య, సునీత, సురేఖ, మల్లమ్మ, భాగ్యమ్మ, లింగమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేయాలి

మద్దూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాల సమ్మె ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మద్దూరు, కొత్తపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులకు వాటి నిర్వహణపై అవగాహన కల్పిలంచారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సరఫరా, గర్భిణి, బాలింతలకు, చిన్నారులకు ఇవ్వాల్సిన ఆహారంపై సీడీపీఓ రోజా అవగాహన నిర్వహించారు. వారు సమ్మెలో ఉండడంతో పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయలక్ష్మి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషిచేద్దాం

- రాష్ట్ర ప్రత్యేక బృందం డాక్టర్ జాన్‌బాబు


మాగనూర్‌లో సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు

మాగనూర్: కుష్టువ్యాధి నిర్మూలనకు వైద్యసిబ్బంది కృషిచేయాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యసిబ్బందికి సూచనలు చేస్తూ.. ఇంటింటి సర్వే చేయడం ద్వారా చర్మంపై మొద్దుబారిన మచ్చలను గుర్తించడం ద్వారా ప్రాథమిక దశలోనే చికిత్స అందిస్తే అంగవైకల్యం ఏర్పడకుండా నిర్మూలించొచ్చని తెలిపారు. అలాగే అలాంటి వ్యక్తులను సేకరణ చికిత్సవిధానం అందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. డీపీఎం వెంకటేశ్వరచారి, ఏపీఎంఓ జోషేప్, శ్రీనివాసురెడ్డి, వైద్యాధికారి నాగరత్నమ్మ, సిబ్బంది సాయిబాబా, యాదమ్మ, వెంకటేష్, అజయ్ పాల్గొన్నారు.

మక్తల్: మండల కేంద్రంలోని బుధవారం పీహెచ్‌సీని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యసిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే చికిత్స అందిస్తే అంగవైకల్యం ఏర్పడకుండా నిర్మూలించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు తిరుపతి, వెంకటేశ్వరచారి, శ్రీనివాస్‌రెడ్డి, సులోచన, శ్రీధర్ పాల్గొన్నారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి


కృష్ణాలో మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ భాస్కర్

కృష్ణా: పండగలను ఎటువంటి గొడవలు లేకుండా గ్రామాల్లో శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే ప్రతిపండుగలను తోటివారికి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని, ముఖ్యంగా యువకులు డీజే వాడే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: హిందు, ముస్లింలు పండుగలను శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ సీహెచ్ కురుమయ్య సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారినుద్దేశించి మాట్లాడారు.. వినాయక చవితి, మిలాన్ ఉన్ నబీపండగలను మతసామరస్యంగా జరుపుకోవాలన్నారు. పండుగల సమయంలో ఎవరైనా సోషల్‌మీడియాలో ఇతర మతస్తులను కించపర్చేవిధంగా పోస్టులు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, మైనార్టీ మతపెద్దలు పాల్గొన్నారు.

మరికల్: పండగలను ఎటువంటి గొడవలు లేకుండా గ్రామాల్లో శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగలు ఒకేసారి రావడంతో ఇరువురు మతాల వారు శాంతియుత వాతావారణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు సలీం డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అవుసలోనిపల్లిలో రైతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు నిర్ణయించేందుకు స్వామినాథన్ సిఫారస్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యమాల కారణంగా కేంద్రప్రభుత్వం మూడు నల్లచట్టాలను వెనక్కి తీసుకుందని మద్ధతు ధరలకు గ్యారంటీ చట్టాన్ని తీసుకొస్తామని, కేంద్రప్రభుత్వం రాతపూర్వకంగా హామీలిచ్చి నిలబెట్టుకోలేదన్నారు. జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెన్నప్ప, వడ్డే మహాదేవ్, పోలప్ప, కృష్ణ, చంద్రప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు


దీక్షలో మాట్లాడుతున్న రైతు నాయకులు

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండలో 127వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. బుధవారం రైతులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పలువురు దీక్షలో కూర్చోగా సాధన సమితి సభ్యులు దండలు వేసి ప్రారంభించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యంకోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే అన్నిఅర్హతలు ఉన్న తమగ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. అన్నిరంగాల్లో వెనకబడిన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కోటకొండ వంటి వెనకబడిన ప్రాంతాన్ని మండలంగా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాశన్న, యాదగిరి, ప్రవీణ్, శ్రీనివాస్, నర్సింహులు, చెన్నప్ప, బాలప్ప, ఆశన్న, రాజు, నారాయణ, తిమ్మన్న, దస్తప్ప పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


నారాయణపేటలో హైదరాబాద్ బయలు దేరుతున్న కార్మికులు


మాగనూర్‌నుంచి బయలు దేరుతున్న కార్మికులు

నారాయణపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నభోజన కార్మికులు పేటనుంచి చలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని పెరిగిన వేతనం అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్ ఇంద్రపార్క్‌లో నిర్వహించే మహాధర్నాకు సీఐటీయూ జిల్లా కో -కన్వీనర్ ఆంజనేయులు, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, జిల్లా నాయకులు రవికుమార్ ముదిరాజ్, తిరుపతమ్మ, అనిత, మణిమాల, పద్మమ్మ తరలివెళ్లారు.

మద్దూరు: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డికి, తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. వంట ఏజెన్సీ మహిళలు పద్మమ్మ, సరోజా, సలీమా, మణెమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

మాగనూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇచ్చిన చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు బుధవారం మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దసంఖ్యలో బయలుదేరారు. సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా మధ్యాహ్నభోజన కార్మికులకు బిల్లులు రాకపోవడంతో వంటల కోసం తెచ్చుకున్న అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, కొత్త అప్పులు పుట్టడం లేదని ప్రభుత్వ నిర్లక్ష్యం విడాలన్నారు. వెంటనే ప్రభుత్వం మ ధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంఘం అధ్యక్షుడు గంగమ్మ, శంకరమ్మ, సారా, ఉమా, మై మోదా, నర్మదా, అనంతమ్మ పాల్గొన్నారు.